క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థినులు

హుస్నాబాద్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో వలంటీర్లు ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నల్లా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, లక్ష్మయ్య, కవిత, స్వరూప, సంపత్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



చెప్యాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఏఈఓల ద్వారా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. మండల పరిధిలోని చెప్యాలలో పత్తి, మొక్కజొన్న, వరి పంటలను శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నమోదు చేయించని రైతులు ధాన్యం విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 10,737 మంది రైతులు 14,063 ఎకరాల్లో సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు చేశామన్నారు. వివరాలు నమోదు చేయించుకోని రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రేణుక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలపై అవగాహన




అలిరాజ్‌పేటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్:/ జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు మేలైన విత్తనాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ జిల్లా రీజినల్ మేనేజర్ కోటిలింగం అన్నారు. శుక్రవారం మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో రైతులకు టీఎస్ సీడ్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి మేలైన విత్తనాలు అందించటమే లక్ష్యంగా తెలంగాణ సీడ్స్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అసిఫ్, సత్తిరెడ్డి, కిష్టయ్య, చారి, బాపురెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

సిద్దిపేటఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సౌత్‌జోన్ కల్చర్ సెంటర్ తంజావూరు ఆధ్వర్యంలో కరైకల్‌లో నిర్వహించిన పాండిచ్చేరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం కళాశాలకు చేరుకున్న వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అభినందించి మాట్లాడారు. ఫ్రెంచ్ ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్యం పొందిన అనంతరం ఆగస్టు 15 నుంచి 17 వరకు స్వేచ్ఛ, విముక్తి ఉత్సవాలను నిర్వహిస్తారని చెప్పారు. తెలంగాణ యువజన అవార్డు గ్రహీత శేఖర్, యువ కళాకారుడు జగిత్యాల భూక్య గంగాధర్‌ల ఆధ్వర్యంలో పది మంది ఉత్సవాల్లో పాల్గొన్నారన్నారు. బంజార నృత్యం, బతుకమ్మ, బోనాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రథమ బహుమతిని అందుకోవడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పల్లవి, డాక్టర్ రాణి, డాక్టర్ భైరయ్య విద్యార్థులను అభినందించారు.

హెడ్‌వార్డర్‌కు సన్మానం



సిద్దిపేటకమాన్: అంకిత భావంతో విధులు నిర్వహించి ఇటీవల రాష్ట్రపతి సేవా పతకం పొందిన సిద్దిపేట జిల్లా జైలు హెడ్ వార్డర్ మల్లారెడ్డిని సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. 2017 నుంచి విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని జైలు సూపరింటెండెంట్ వికాస్ తెలిపారు. రాష్ట్రపతి సేవా పతకం పొందిన మల్లారెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరెడ్డి, శంకరవల్లి, అనిల్‌రెడ్డి, బాలకృష్ణ, కనకయ్య, భారతమ్మ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పాపన్న

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఆయా నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు రాజకీయ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యాధికారం కోసం ఆయన కన్న కలలను నిజం చేయాలని వక్తలు పిలుపు ఇచ్చారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు.



కొమురవెల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి అర్పిస్తున్న సినిమా హీరో సుమన్



మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లిలో..



హుస్నాబాద్‌లో..



హుస్నాబాద్ రూరల్: పొట్లపల్లిలో..



కోహెడలో నివాళి అర్పిస్తున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



జగదేవ్‌పూర్‌లో..



చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో..



దౌల్తాబాద్‌లో..



మద్దూరు(హుస్నాబాద్): బెక్కల్ గ్రామంలో..



వర్గల్ (గజ్వేల్): మజీద్‌పల్లిలో..

పాపన్న పోరాట యోధుడు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటరూరల్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ 373వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న గౌడ్ చేసిన కృషి చరిత్రలో నిలిచిందన్నారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక అని, నాటి కాలంలో అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను కావాలని ప్రజాస్వామ్య స్ఫూర్తితో చేసిన పోరాటం గొప్పదన్నారు.



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఆయన గొప్పదనాన్ని స్మరించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి మురళి, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించడం సంతోషం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పాపన్న విగ్రహ ఆవిష్కరణలో మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప పోరాట యోధుడన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ సమానత్వం కోసం ఉద్యమించాడ, ఆయన జయంతిని ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

పొల్కంపల్లి జయంతి, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ఏకం కావాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

కొండపాక(గజ్వేల్): ముదిరాజ్‌లు రాజ్యాధికార దిశగా ఏకం కావాలని తెలంగాణా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోగల పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు యమధర్మ, ప్రధాన కార్యదర్శి బర్ల మల్లికార్జున్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొట్టాల యాదగిరి మాట్లాడుతూ ముదిరాజ్‌లు రాష్ట్రం వ్యాప్తంగా 50 లక్షల ఓట్లను కలిగి ఉన్నారన్నారు. మండల, గ్రామ కమిటీలతో ముదిరాజ్‌ల వర్గాన్ని బలోపేతం చేస్తామన్నారు.

మండల అధ్యక్షుడిగా జిర్ర రాజు

ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా ఖమ్మంపల్లికి చెందిన జిర్ర రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పిట్ల దుర్గయ్య, నీల వెంకటేశ్, చింత యాదగిరి, నేతి పాండు, చెంది మల్లికార్జున్, అర్జునపట్ల కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా పాతర్ల కొండల్, సహాయ కార్యదర్శులు తేలు భాస్కర్, రాజు, నల్ల యాదగిరి, యువజన విభాగం మండల అధ్యక్షుడిగా తిమ్మారెడ్డిపల్లికి చెందిన సున్నం భాస్కర్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, లవన్ కుమార్, గొడుగు కనకయ్య తదితరులు ఎన్నికయ్యారు.

కులగణన చేపట్టకపోవడం దుర్మార్గం

బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు కుమార్

తొగుట(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణనను చేపట్టకపోవడం సిగ్గుచేటని బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ నాగెల్లి కుమార్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో బామ్‌సెఫ్ పదో మహాసభల కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పశువుల లెక్కలను తీసిన బీజేపీ ప్రభుత్వం బీసీల కుల గణనను చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఈనెల 27న నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే బామ్ సెఫ్ మహాసభలను విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో బహుజన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముక్తిపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పాత్కుల వెంకటేశం, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

సొంతవారికే ప్రభుత్వ పథకాలు

బీజేపీ నాయకుల ఆరోపణలు

హుస్నాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నియోజకవర్గ స్థాయిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి హాజరయ్యారు. సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తుండగా పోలీస్‌లు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీస్‌లు, బీజేపీ నాయకులు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

ములుగు(గజ్వేల్): ప్రభుత్వం అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ అధ్యక్షుడు రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం ములుగు రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింప జేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, గజ్వేల్ కోకన్వీనర్ మహేష్, కొండపాక, వర్గల్ మండలాల అధ్యక్షులు శౌధర్‌రెడ్డి, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

పాత భవనం స్థానంలోనే..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో అంబేద్కర్ భవన నిర్మాణం పాత భవనం స్థానంలోనే నిర్మించాలని ఎంపీడీఓ రాము సూచించారు. భవనం శిథిలావస్థకు చేరడం వలన అసౌకర్యంగా మారిందని మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. పాత భవనం మరమ్మతులకు కాకుండా కొత్త భవన నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంత్రి మంజూరు చేశారు. ఈ నిధులతో మరోచోట నిర్మించాలని పేర్కొనగా శుక్రవారం సర్పంచ్ నర్సింగరావు, పాలక వర్గ సభ్యులు దళిత సంఘం సభ్యులతో ఎంపీడీఓ రాము మాట్లాడారు. పాత భవనం స్థానంలో నిర్మించేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. కార్యక్రమంలో ఎంపీఓ విష్ణు, పీఆర్ ఏఈ సమ్మయ్య, కార్యదర్శి పాల్గొన్నారు.

పేదల సొమ్ము వెనక్కి ఇవ్వాలి

మద్దూరు(హుస్నాబాద్): దళిత బంధు పథకం పేరిట జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, అతడి అనుచరులు పేదల నుంచి వసూలు చేసిన సొమ్ము వెనక్కి ఇవ్వాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొంగొని సురేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆగడాలు శృతిమించాయని, ప్రజలు తిరస్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఈనెల 22న చేర్యాలలో రాస్తారోకో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మద్దూరు మండల ప్రధాన కార్యదర్శి ఉదయ్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు యామా శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



హరికిరణ్‌కుమార్

వర్గల్(గజ్వేల్): వర్గల్ తహసీల్దార్‌గా హరికిరణ్ కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై కరీంనగర్ జిల్లా నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సతీష్‌కుమార్ రాయపోల్‌కు బదిలీ అయ్యారు.



ఆశాజ్యోతి, మల్లికార్జున్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల తహసీల్దార్‌గా మల్లికార్జున్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పనిచేశారు. ఇక్కడ పని చేసిన ఆశాజ్యోతి సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, పుల్లోజు కిరణ్ కుమార్‌చారి ఆశాజ్యోతికి వీడ్కోలు, మల్లికార్జున్‌రెడ్డికి స్వాగతం పలికారు.



శ్రావణ్‌కుమార్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండల తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రఘువీరారెడ్డి బదిలీపై వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): మండల కేంద్రంలో ప్రభుత్వ పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో సభ్యత్వ నమోదు, కమిటీ ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టమిట్ల గ్రామంలో పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న, గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. స్వరాష్ట్రం వస్తే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని అనుకుంటే మాయమాటాలు చెప్పి కేసీఆర్ పేదలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బస్వారాజు శంకర్, మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దుబ్బాక మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం

చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చైర్‌పర్సన్ వనిత అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ చొరవతో దుబ్బాక మున్సిపల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి రూ.10 కోట్లు మంజూరు చేశారన్నారు. దుబ్బాక అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, ఎమ్మెల్యే రఘునందన్‌రావు దుబ్బాకకు చేసింది ఏమీలేదని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో స్థానం లేదు



మాట్లాడుతున్న రాజారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాజకీయ వ్యాపారం వల్లే సామాన్యుడికి చట్టసభల్లో స్థానం లేకుండా పోతోందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం చేర్యాలలో భూమయ్య అధ్యక్షతన జరిగిన ఏఐటీయూసీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. చట్టసభల్లో సామాన్యుడికి రాజ్యాధికారం రావాలంటే వెంటనే దామాషా పద్ధతి ప్రవేశపెట్టాలన్నారు.

దళితబంధు అందడంలేదని నిరసన

జగదేవ్‌పూర్(గజ్వేల్): అర్హులకు దళిత బంధు అందడం లేదని మండలంలోని తిగుల్ దళితులు శుక్రవారం నిరసన చేపట్టారు. తమకు ప్రభుత్వ పథకాలు అందలేదని గ్రామ వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో షర్మిలకు వినతిపత్రం పంపారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్స్ ఘన స్వాగతం పలికారు. అందరూ కలిసిమెలిసి చదువుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, లెక్చరర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దేవాలయ అభివృద్ధికి కృషి**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. శుక్రవారం ఆలయ పరిసరాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రదక్షిణ మార్గం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేములవాడ తర్వాత పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరుడిని దర్శించుకొనేందుకు భక్తులు తరలివస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతి రెడ్డి, సర్పంచ్ దేవసాని సుశీల, కోఆప్షన్ సభ్యుడు సలీం, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, కానుగుల మోహన్, మార్క చంద్రయ్య తదితరులు ఉన్నారు.

◆ **అపరిచితులకు వివరాలు చెప్పొద్దు**

మద్దూరు(హుస్నాబాద్): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపరిచితులకు ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్ చెప్పకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఇచ్చినవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే 100 టోల్ ఫ్రీ నంబర్ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

◆ **సామూహిక సీమంతం**

కోహెడ(హుస్నాబాద్): కోహెడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. సర్పంచ్ పెరియాల నవ్య వారికి పండ్లు, దుస్తులు అందజేశారు. ఇకపై ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్‌రావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, కోదండరాం, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాదరావుశర్మ, పొన్నాల లక్ష్మయ్య, బద్దం తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్‌రావు, తిప్పారపు నాగరాజు, కందారపు ప్రసాద్‌చారి, అనిల్‌చారి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **ఓటరు అవగాహనకు 5కే రన్**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అక్కన్నపేట పోలీస్ స్టేషన్ నుంచి చౌటపల్లి మల్లికుంట స్టేజ్ వరకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సంజీవ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ 5కే రన్‌లో యువకులు, మహిళలు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గజ్వేల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు శనివారం 5కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలోగల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రజ్ఞాపూర్ వరకు నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల అవగాహన కోసం 5కే రన్ నిర్వహిస్తున్నామన్నారు.

◆ **చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజన్న, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కాండం తొలుచు పురుగు నివారణపై అవగాహన**

కొమురవెల్లి(సిద్దిపేట): వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణపై ఏడీఏ రాధిక, మండల వ్యవసాయ అధికారి నరేష్ మండలంలోని మర్రిముచ్చాల రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు(మొగి పురుగు) ను బయోలాజికల్ పద్ధతిలో అరికట్టవచ్చన్నారు. చేనుకు ఉపయోగపడే జీవులను ఉపయోగించి మొగి పురుగును నివారించవచ్చని సూచించారు.

◆ **రూ.1.73 కోట్ల రుణమాఫీ**

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ రైతుబాంధవుడని రుణమాఫీతో మరోసారి నిరూపించుకున్నాడని వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వర్గల్ పీఏసీఎస్ పరిధిలో 520 మంది రైతులకు రూ. 1,73,40,513 రుణమాఫీ లబ్ధిచేకూరిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు తెలంగాణ రైతాంగం రుణపడి ఉంటుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ కార్యదర్శి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం**

ములుగు(గజ్వేల్): మండలంలోని సింగన్నగూడ గ్రామంలో ఇటీవల మరణించిన కంచనపల్లి సాయి కిరణ్‌గౌడ్ కుటుంబాన్ని మండల బీజేపీ సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆర్థిక సాయం కింద కొంత మొత్తం అందజేశారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యంయాదవ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **అధికారులకు సన్మానం**

కొండపాక(గజ్వేల్): గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, కొండపాక తహసీల్దార్ చల్లా శ్రీనివాస్ ఇటీవల బాధ్యతలు చెపట్టారు. శుక్రవారం వారిని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మల్లమారి రవీందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ భాస్కర్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

◆ **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

సిద్దిపేటజోన్: ట్రాఫిక్ ఇబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మాస్టర్ మైండ్స్, ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలు, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి, మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ విజయ్, కరస్పాండెంట్ మల్లారెడ్డి, అధ్యాపకులు, ట్రాఫిక్ సిబ్బంది, పాల్గొన్నారు.

◆ **కల్లాలు ఏర్పాటు చేయాలి**

వర్గల్(గజ్వేల్): ఆసుపత్రి పాత భవనం కూల్చేసిన స్థలంలో రైతు కల్లాలు ఏర్పాటు చేయాలని, తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రభుత్వ స్థలంలో నూతన ఆసుపత్రి భవనం నిర్మించాలని వర్గల్ రైతులు మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితర రైతులు ఆసుపత్రి పాతభవనం కూల్చిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ఎకరం స్థలం తహసీల్దార్ కార్యాలయం వెనక ఉందన్నారు. మంత్రి ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు.